క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

భీమునిపట్నం: జీవీఎంసీ 3వ వార్డు పరిధి ఎస్‌టీఆర్ కాలనీ వద్దనున్న శ్రీలక్ష్మీ గణపతి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అల్లిపిల్లి వేణుబాబు, ఆలయ ధర్మకర్త పీతల అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి వైద్యానికి ఫ్యాబ్ సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఫ్యాబ్ ప్రతినిధులు

భీమునిపట్నం: మానసిక, వినికిడి సమస్యతో బాధపడుతున్న యువకుడికి స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) ప్రతినిధులు శనివారం ఆర్థిక సాయం అందించారు. కొంకువీధికి చెందిన చిలకా శ్యామలరావు చాలా కాలంగా ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఫ్యాబ్ ప్రతినిధులు రూ.10 వేలు అందించారు. సన్నీ కాళ్ల, మారోజు గోపి, దేవానంద్, కట్టమూరి అశోక్, మొకర శ్రీరామమూర్తి పాల్గొన్నారు.


రామారావుకు ఎమ్మెల్యే నివాళి



దివంగత సర్పంచ్ రామారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తగరపువలస: ఇటీవల మృతి చెందిన భీమిలి మండలం లక్ష్మీపురం సర్పంచ్ లచ్చుబుగత రామారావుకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం నివాళులర్పించారు. లక్ష్మీపురంలోని ఆయన నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రామారావు సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం మజ్జివలస పీఏసీఎస్ పరిధిలో ఇటీవల మరణించిన ఎర్నింటి కృష్ణ కుటుంబ సభ్యులకు రూ.30వేల బీమా పరిహారం అందించారు. కార్యక్రమంలో భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కరుభుక్త జోగినాయుడు, కరుభుక్త అప్పలనారాయణ, గాడు తాతినాయుడు, గాడు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధునికి ఎన్టీఆర్ అభిమానుల సాయం



బాలి రమణకు రూ.10వేలు అందిస్తున్న ఎన్టీఆర్ అభిమానులు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలసకు చెందిన బాలి రమణకు వైద్య ఖర్చుల నిమిత్తం ఎన్టీఆర్ అభిమానుల అసోసియేషన్ శనివారం రూ.10వేలు సాయం అందించింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు స్థానికుల సూచన మేరకు ఈ మొత్తాన్ని అందించారు. కార్యక్రమంలో రౌతు గోవింద, లెంక శ్రీను, కాగితాల రాజశేఖర్, బల్ల శ్రీను, బల్ల రాజు, బంటుపల్లి రాజు, రవీంద్ర పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 3,028 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ విజయలక్ష్మి



హాజరైన కక్షిదారులు

తగరపువలస: నేషనల్ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం భీమిలిలో నిర్వహించిన కార్యక్రమంలో 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ పి.విజయలక్ష్మి 3,028 కేసులు పరిష్కరించారు. వీటిలో 234 ఐపీసీ, 74 ఎస్‌ఈబీ, 303 ట్రాఫిక్, 2373 చిల్లర వర్తకులు, గృహహింస, భరణాలు, పెట్టీ తదితర కేసులు ఉన్నాయి. ఈ సందర్భంగా భీమిలి, ఆనందపురం, పద్మనాభం, భీమిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ల పరిధిలో కేసులు నమోదైన కక్షిదారులు, పోలీసులు, ఏపీపీలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ విజయలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొనడానికి అన్నివర్గాల ప్రజలు సహకరించాలని సూచించారు.

కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు చందు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సుందర్ సింగ్, మాజీ ఏజీపీ కె.వసంత, భీమిలి ఎస్‌ఐ గంటా హరీష్, న్యాయవాదులు వాయునందనరావు, కె.ఎస్.ఎం.సుధాకర్, సరగడ సురేష్‌రెడ్డి, ఎర్రా సూర్యప్రకాష్, నమ్మి సూరిబాబు, దుర్గా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

కొమ్మాది: జీ – 20 సదస్సు నిర్వహణ కోసం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నేపథ్యంలో గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాల్లో జరుగుతున్న సుందరీకరణ పనులను జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి శనివారం పరిశీలించారు. ఫుట్‌పాత్‌ల ప్యాచ్ వర్క్‌లు, రహదారుల పక్కన తుప్పల తొలగింపు, డివైడర్లకు రంగులు వేయించడం వంటి పనులను ఆమె పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

గ్రామీణ వైద్యులకు నిపుణులతో శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుధాకర్ రెడ్డి

ఆనందపురం : గ్రామీణ వైద్యుల సేవలను మరింత మెరుగుపరచడానికి నిపుణులతో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని మండల సంఘం అధ్యక్షుడు పోతిరెడ్డి సుధాకర్ రెడ్డి చెప్పారు. మండలంలోని వేములవలసలో శనివారం ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ వ్యాధులపై వైద్యులకు పూర్తిగా అవగాహన ఉంటేనే చికిత్స అందించగలరన్నారు. ప్రతి నెల 2వ శనివారం శిక్షణ తరగతులు నిర్వహించడానికి నిపుణులను సంప్రదిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి, కోశాధికారి పచ్చిపులుసు కనకారావు, జిల్లా ఉపాధ్యక్షుడు పడాల రామకోటేశ్వర రావు, మండల కార్యదర్శి నాగేశ్వర రావు, నాయకులు జి.రఘు, కాంచన తదితరులు పాల్గొన్నారు.

కృష్ణంరాజుపేటలో పశువైద్య శిబిరం



పశువైద్య శిబిరం ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో శనివారం ఫలర్టన్ ఇండియా క్రెడిట్ బ్యాంక్, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో దాకమర్రి పశువైద్యశాల వైద్యుడు ఆర్.శ్రీనివాస్ 60 పశువులకు వైద్యసేవలు అందించారు. ఈ శిబిరాన్ని భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు ప్రారంభించి రైతులకు ఉచితంగా మందులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాడిరైతులు ప్రభుత్వం అందించే వ్యాధి నిరోధక వ్యాక్సిన్లను సకాలంలో వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాడు వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వైస్ సర్పంచ్ మద్దిల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు తుపాకుల పైడిరాజు, బ్యాంకు మేనేజర్ పితాని తాతారావు, సిబ్బంది జామి వంశీబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గాడు తాతినాయుడు, కరుభుక్త అప్పలనారాయణ, గాడు సన్యాసినాయుడు, పశు సంవర్ధకశాఖ సహాయకులు పొట్నూరు పైడిరాజు, బూర్లె కృష్ణ, గోపాలమిత్ర పందిరి కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి



భీమిలిలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



పద్మనాభంలో దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

భీమునిపట్నం: భీమిలిలోని బీజేపీ కార్యాలయంలో భారతీయ జనసంఘ్ మాజీ అధ్యక్షుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా ప్రముఖ్ అడుసమిల్లి కేశవకాంత్ మాట్లాడుతూ దీన్‌దయాళ్ మానవతావాద సిద్ధాంతం ప్రచారం చేస్తూ గొప్ప సేవలు అందించారని కొనియాడారు. పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు, నాయకులు శ్రీహరి, కంటుభుక్త సునీత, పోలుబోతు విజయ, తీగల ప్రభాకర్ పాల్గొన్నారు.

పద్మనాభం: బీజేపీ మండల కార్యాలయంలో శనివారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య విభాగ కన్వీనర్ రూపాకుల రవికుమార్ తదితరులు దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకాత్మత, మానవతావాద సిద్ధాంత రూపకర్త దీన్‌దయాళ్ అని కొనియాడారు.

ఆర్‌ఎస్‌ఎస్ స్థాపనకు కృషి చేసి 1967లో అధ్యక్షునిగా పనిచేశారన్నారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, పాలూరి కృష్ణారావు, మహంతి అప్పలరమణ, హంస మహేష్, కర్రి ఈశ్వరరావు, పడాల శ్రీను, గౌరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు



ఆర్‌హెచ్ కాలనీ నుంచి సాయిబాబా గుడికి వెళ్లే రోడ్డు దుస్థితి

పీఎం పాలెం: పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీ నుంచి స్థానిక షిర్డీసాయి బాబా ఆలయానికి వెళ్లే రహదారి కనీస అభివృద్ధికి నోచుకోలేదని స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు కొండవాలులో ఉంది. నిర్మాణాల పేరుతో గతంలో వేసిన మట్టి పోగులు తొలగించకపోవడంతో రోడ్డును మట్టి ఆక్రమించింది. వీధి దీపాలు వెలగకపోవడంతో చీకటి పడితే ఆ రోడ్డులో అంధకారం రాజ్యమేలుతోంది. పురుగుల బెడద అధికంగా ఉంది. పందులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. వెంటనే జీవీఎంసీ అధికారులు స్పందించి వీధి లైట్లు పునరుద్ధరించి.. రోడ్డును అభివృద్ధి చేయాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డాక్‌యార్డ్‌లో ఎలక్ట్రీషియన్ మృతి

మల్కాపురం: డాక్‌యార్డులో విధులకు వెళ్లిన ఓ ఉద్యోగి విద్యుత్ షాక్ కారణంగా మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 58వ వార్డు పరిధి రామ్‌నగర్ ప్రాంతంలో ఒడరేవుల కుమార్‌స్వామి (35) భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నారు. నేవల్ డాక్‌యార్డ్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. రోజూ మాదిరీగానే శనివారం ఉదయం ఫస్ట్ షిఫ్ట్‌కు డ్యూటీకి వెళ్లాడు. అనంతరం 8.15 గంటల సమయంలో డాక్‌యార్డ్‌లోని డాక్ వద్ద గల ఓ నౌక దిగువవ కుమార్‌స్వామి నీటిలో మునిగి ఉన్నట్టు ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సహచర ఉద్యోగులు గుర్తించారు. వెంటనే వారు ఉన్నతాధికారులకు సమాచారమివ్వడంతో కుమార్‌స్వామిని ఐఎన్‌ఎస్ కల్యాణి ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టుగా వైద్యులు నిర్ధారించారు. వెంటనే అధికారులు మల్కాపురం పోలీసులకు, మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఐఎన్‌ఎస్ కల్యాణి ఆస్పత్రికి వెళ్లి ఘటనపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

పద్మనాభం: మండలంలోని కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్‌పై హైదరాబాద్ నుంచి వచ్చిన జనరల్ ఇన్సూరెన్స్ చీఫ్ అడ్వయిజర్ జరజాపు సురేష్ శనివారం అవగాహన కలిగించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులకు స్కిల్ డెవలప్‌మెంట్, ఆరోగ్య సూత్రాలు, సమయపాలన, సబ్జెక్టుల వారీగా వివరణాత్మక విశ్లేషణపై అవగాహన కలిగించారు. పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మేరీ గ్రేస్ లిల్లీ, హిందీ అధ్యాపకురాలు కోమలి, సంకురుభుక్త జోగారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి



సత్తిబాబు (ఫైల్)

తగరపువలస: పద్మనాభం మండలం పెంట గ్రామంలో శనివారం రాత్రి ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటనలో అదే పంచాయతీకి చెందిన దాసరి సత్తిబాబు (29) అనే డ్రైవర్ మృతి చెందాడు. గ్రామంలోని గృహ నిర్మాణ వ్యర్థాలను పంచాయతీ శివారున ఉన్న చెరువులోకి తరలిస్తుండగా గోతిలో టైరు దిగడంతో ట్రాక్టర్ బోల్తాపడింది. 108 సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదం జరిగిన ట్రాక్టర్‌కు బీమా సదుపాయం లేనట్టు తెలిసింది. బాధిత కుటుంబాన్ని ట్రాక్టర్ యాజమాన్యం, ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. భార్య అప్పలకొండ ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేశారు.

310 కేజీల బియ్యం సీజ్



మారికవలసలో బియ్యం పరిశీలిస్తున్న సిబ్బంది

మధురవాడ: విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం మారికవలసలో రెవెన్యూ సిబ్బంది పీడీఎస్ బియ్యం శనివారం పట్టుకున్నారు. మారికవలస ఆర్‌జీకే కాలనీ 121వ బ్లాకు, జీఎఫ్ 1లో శ్రీనివాసరావు ఇంట్లో తనిఖీలు చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 310 కేజీల రేషన్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. గ్రేడ్ 2 వీఆర్‌వో హర్షవర్ధన్, వలంటీర్లు పృథ్వీరాజ్, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని చెప్పారు.

అనిట్స్‌లో అతిథి ఉపన్యాసం

తగరపువలస: సంగివలస అనిట్స్ ఈసీఈ విభాగంలో శనివారం నిట్ వరంగల్ ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీహరిరావు ప్రసంగించారు. 'రీసెంట్ ట్రెండ్స్ అండ్ ఆపర్చునిటీస్ ఇన్ ఐసీ డిజైన్'పై అవగాహన కలిగించారు. ఐవోటీ అప్లికేషన్‌లో ఐసీ ఫ్యాబ్రికేషన్‌పై అవగాహన కలిగించారు. అనలాగ్ సిగ్నల్ ప్రాసెసింగ్ గురించి తెలియచేశారు. కార్యక్రమంలో అనిట్స్ ఈసీఈ విభాగాధిపతి బి.జగదీష్, జి.మధుసూధనరావు, వి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఏయూ సెక్యూరిటీ గార్డుల అరెస్ట్

బీచ్‌రోడ్డు : మూడో పట్టణ పరిధిలో గంజాయి కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి బీచ్‌రోడ్డులో అక్రమంగా గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఏయూలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న చంద్రమౌళి, అప్పలరాజు, సురేష్ వద్ద అక్రమంగా 500 గ్రాములు గంజాయిని గుర్తించారు. ఈ ముగ్గుర్ని అరెస్ట్ చేసి శనివారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సంతపేట బావిని పరిరక్షించాలి



సంతపేటలో బావి చుట్టూ నాచుతో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంతపేటలో పురాతన బావి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. చుట్టుపక్కల ప్రజలు బావి లోపలే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాన్ని కూడా డంపింగ్ యార్డుగా మార్చేశారు. దీంతో బావి చుట్టూ నాచు పేరుకుపోయింది. గతంలో జీవీఎంసీ వీధి కుళాయిలు లేనప్పుడు తగరపువలస, చిట్టివలస ప్రజలు ఈ బావి నుంచే తాగునీరు సేకరించుకునేవారు. ప్రస్తుతం జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం నుంచి నీరు సరిపడినంతగా వస్తున్నందున బావి స్థానికుల నిర్లక్ష్యానికి గురయింది. ఈ బావిలో నీరు పుష్కలంగా ఉంటే చుట్టుపక్కలున్న బోరుబావులకు తగినంత నీరు చేరుతుందని, అందువల్ల బావిలో చెత్త వేయకుండా పరిరక్షించాలని, బావిలో పూడికను జీవీఎంసీ సిబ్బంది తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

దక్షిణ భారత హిందీ పరీక్షలు ప్రారంభం



భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో హిందీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ (చెన్నై) ఆధ్వర్యంలో హయ్యర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో 41 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ప్రధానోపాధ్యాయురాలు మాదాబత్తుల తిరుమల శ్రీదేవి పర్యవేక్షణలో ఇన్విజిలేటర్లుగా స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రెండో రోజైన ఆదివారం హయ్యర్ అభ్యర్థులకు మూడో పరీక్ష, వైవాతోపాటు లోయర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్టు ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు.

జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి



ఇళ్ల నిర్మాణాలపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

దాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడతున్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఆనందపురం మండలం తంగిడిబిల్లిలో నిర్మిస్తున్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 690 ఎకరాల్లో 16,800 ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం 1,200 ఇళ్ల మ్యాపింగ్‌తోపాటు ట్యాగింగ్ కూడా పూర్తయ్యిందని, 6వేల ఇళ్లకు ప్లింత్‌బీమ్ వరకు పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన ఇళ్ల లబ్ధిదారులకు మ్యాపింగ్, ట్యాగింగ్ చేసి, ఈ ఏడాది డిసెంబర్ నాటికి నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ పనుల్లో అలసత్వం ప్రదర్శించరాదని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్‌కు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 11 బోర్లు పనిచేస్తున్నాయని, ఇంకా 7 ఏర్పాటు చేయాల్సి ఉందని, బోర్ల నుంచి నీటి పరిమాణం తక్కువగా ఉన్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ఇసుక కొరత లేకుండా చూడాలని సూచించారు. పర్యటనలో ప్రాజెక్టు డైరెక్టర్ పాపునాయుడు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, హౌసింగ్ ఉప కార్యనిర్వాహక ఇంజినీరు, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు వీరే

తగరపువలస: వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ల జాబితా శనివారం విడుదల చేశారు. భీమిలి మండలం సోషల్ మీడియా కన్వీనర్‌గా ఆవాల గౌరీశంకర్, కో కన్వీనర్లుగా చిల్ల ప్రకాశ్‌రెడ్డి, చిల్ల శ్రీనివాసరెడ్డి, ఇద్దిపల్లి నానాజీ, సురపతి అప్పలరాజు నియమితులయ్యారు. ఆనందపురం మండల కన్వీనర్‌గా గీతల దేవుడు, కో కన్వీనర్లుగా ఇనపకుర్తి కనకరాజు, టి.గోవింద్, కె.నగేష్, బి.పైడిరాజు నియమితులయ్యారు. పద్మనాభం కన్వీనర్‌గా ఒమ్మి పైడినాయుడు, కో కన్వీనర్లుగా మజ్జి సోమేశ్వరరావు, కోరాడ శివ, బక్క మోహన్ నియమితులయ్యారు.

జీవీఎంసీ భీమిలి నియోజకవర్గ వార్డు కన్వీనర్లు..

జీవీఎంసీ భీమిలి, మధురవాడ జోన్‌లలో సోషల్ మీడియా వార్డు కన్వీనర్లు ఇలా ఉన్నారు. తమ్మిన అశోక్(1వ వార్డు), దొడ్డి ప్రసాద్(2), కె.వెంకటేష్(3), ఎన్.శ్రీనివాసరెడ్డి(4), కె.సమిత్‌కుమార్(5), పి.కిరణ్(6), కె.సూరిబాబు(7), ఎ.రామారావు(8), బోర ప్రకాష్‌రెడ్డి(9వ వార్డు).

వైఎస్సార్ సీపీ నేత అప్పారావుకు కన్నీటి వీడ్కోలు



మజ్జి అప్పారావు



అప్పారావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : తర్లువాడకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, పారిశ్రామికవేత్త, ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక చిన్నాన్న మజ్జి అప్పారావు హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా శనివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అప్పారావు భౌతికకాయాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతిమ యాత్ర, దహన సంస్కార కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీకి ఎనలేని సేవలు అందించిన అప్పారావు మృతి తీరని లోటని, మండల పరిషత్ ఎన్నికల్లో పార్టీ గెలిపొందడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అప్పారావుకు భార్య సత్యవతి, ప్రదీప్, జానకీరామ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. అప్పారావు భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఆనందపురం, పద్మనాభం మండలాల పార్టీ అధ్యక్షులు బంక సత్యం, కోరాడ లక్ష్మణరావు, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాం, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ దాట్ల పెదబాబు, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, నాయకులు కాకర్లపూడి వరహాలరాజు, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, బంటుబిల్లి మణిశంకర నాయుడు, పాండ్రింకి అప్పారావు, గండ్రెడ్డి శ్రీనివాస్, కోరాడ ముసిలినాయుడు, డోల దేవుడు, మరుపిళ్ల చిన్నయ్య పాత్రుడు, కాకర వెంకట రమణ, లెంక రాంబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నివాళులర్పించారు.

శ్మశానవాటిక ముందు డెబ్రిస్ డంప్



చిట్టివలస శ్మశానవాటిక ముందు వేసిన డెబ్రిస్ పోగులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలస శ్మశానవాటిక ముందు మూడు రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు డెబ్రిస్ తెచ్చి పోగులు పెడుతున్నారు. ఇలా పడేసిన డెబ్రిస్ పోగుల కారణంగా వీటి భారం శ్మశానవాటిక ప్రహరీపైనే కాకుండా రహదారిపై పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిట్టివలస బాలికల జెడ్పీ హైస్కూల్ ప్రహరీ మొదలుకుని గోస్తనీనది వంతెన అప్రోచ్ రోడ్డు పొడవునా శ్మశానవాటిక చుట్టూ ఈ డెబ్రిస్ పోగులు కనిపిస్తున్నాయి. ఇటీవల సంతపేటలో పాత ఇంటిని కూల్చివేసిన డెబ్రిస్ ఇక్కడ పడేసి ఉంటారని కొండపేట సచివాలయ సిబ్బంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ డెబ్రిస్ వేయడం వల్ల మిగిలినవారికి ఇబ్బంది కలుగుతుందని, సంబంధిత వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలు, పబ్లిక్‌కు ఇబ్బంది కలిగించే ప్రదేశాల్లో డెబ్రిస్ డంప్ చేస్తున్నవారిపై టౌన్ ప్లానింగ్ సిబ్బంది దృష్టి సారించాలని కోరుతున్నారు.